సాక్షి
మెదక్
సోమవారం । 12 । మే । 2025



సేద్యంలో 'లక్ష్మి'

కొత్తదనానికి ఆధునికత జోడించి పంటల సాగులో మహిళా రైతు ఆదర్శంగా నిలిచింది.

వివరాలు 8లో ▸



హక్కుల సాధనకు పోరాటం

కార్మికుల హక్కుల సాధనకు సీపీఐ పోరాడుతుందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. వివరాలు 8లో ▸



చెక్‌డ్యాంలతో జలకళ

చిలప్‌చెడ్ మండలంలోని చెక్ డ్యాంలతో ఏటా రెండు పంటలకు సాగు నీరు అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఎస్టీ గురుకులాల్లో ఇంటర్ అడ్మిషన్లు

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 15, 16వ తేదీల్లో ఎస్టీ గురుకులాల్లో ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు జరుగుతాయని కౌడిపల్లి ఎస్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఫణికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెదక్, నిజామాబాద్, కామారెడ్డిలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో 2025– 26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని చెప్పారు. ఇందులో భాగంగా ఈనెల 15న కామారెడ్డిలో బాలురకు, 16న చేగుంటలో బాలికలకు కౌన్సిలింగ్ నిర్వహించి మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు ఇస్తామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులు అయిన విద్యార్థులు సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

ధాన్యం తూకంలో మోసం



కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని బచ్చురాజ్‌పల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో 44 కిలోలు తూకం వేస్తున్నారని ఆదివారం రైతులు ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తూకం వేసేటప్పుడు ఒక బస్తాకు 4 కిలోల వరకు అదనంగా పెడుతున్నారని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మెగా ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, రాచకొండ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ నంద్యాల నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో నిరుపేదలకు వైద్య సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. శిబిరంలో సుమారు 300 మంది మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఐలు సృజన, నారాయణ, ఏఎస్‌ఐ జైపాల్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సైన్యానికి మద్దతుగా నిలుద్దాం

ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు, చిత్రంలో జిల్లా అధ్యక్షుడు శంకర్

దుబ్బాక: ఆపరేషన్ సిందూర్‌తో మనదేశ శక్తి సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలపామని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం దుబ్బాక పట్టణంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాంలో ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్‌తో మన సైనికులు పాక్‌కు తగిన గుణపాఠం చెప్పారన్నారు. భారత్–పాక్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దేశమంతా మన సైన్యానికి మద్దతుగా నిలవాలన్నారు. దేశరక్షణ కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ విరామం లేకుండా పనిచేస్తున్నారన్నారు. దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న సైన్యానికి మనమంతా అండగా ఉందామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుభాష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేత్రపర్వంగా ధ్వజారోహణం



గరుడ ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): పురాతన ప్రాశస్త్యం కలిగిన వర్గల్ వేణుగోపాలుని కోవెల బ్రహ్మోత్సవ శోభను సంతరించుకుంది. ఆదివారం గరుడ ధ్వజారోహణ మహోత్సవం నేత్రపర్వం చేసింది. సకల దేవతలకు నవాహ్నిక బ్రహ్మోత్సవ ఆహ్వానం చేరింది. మొదట విష్ణుమూర్తికి అత్యంత ప్రీతిపాత్రుడైన గరుడాళ్వారు చిత్రంతో కూడిన పతాకానికి అర్చకస్వాములు విశేష పూజలు నిర్వహించారు.

హరితం.. ఆహ్లాదం

హరితహారంలో నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగాయి. రహదారుల వెంట పచ్చని తోరణాలుగా మారాయి. ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతున్నాయి. మెదక్‌- జోగిపేట ప్రధాన రహదారిని కలుపుతూ మండల కేంద్రం కొల్చారానికి వెళ్లే వరిగుంతం రోడ్డుకు ఇరువైపులా నాటిన కానుగ చెట్లు ఏపుగా పెరిగి రహదారికి కొత్త శోభను తెచ్చిపెట్టాయి.

- కొల్చారం(నర్సాపూర్)



బోనం.. వైభవం

శ్రీ జగదాంబదేవికి ఆదివారం గిరిజన మహిళలు బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని తునికి దేవుల తండా జగదాంబదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను ఇటీవల వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా అమ్మవారికి గిరిజనులు సాంప్రదాయ పద్ధతిలో బోనాలు తీశారు.

- కౌడిపల్లి(నర్సాపూర్)



బడి బాట.. లెక్కల మూట!

ప్రభుత్వ పాఠశాలలపై కుదరని గురి

- మధ్య తరగతి వారు సైతం ప్రైవేటుకే..
- జిల్లాలో 27 జీరో నమోదు స్కూళ్లు
- భరోసా కల్పిస్తే పెరగనున్న ప్రవేశాలు

పాపన్నపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు ఘనంగా ఉన్నా.. ప్రవేశాలు మాత్రం అధ్వానంగా ఉంటున్నాయి. ఏటా ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహిస్తున్న బడి బాట.. లెక్కల మూటగానే మారుతుంది. 5వ తరగతి చదివే విద్యార్థులను.. ఆరో తరగతిలో చేర్పించి.. మేం ఇంత మంది ని నమోదు చేశామని టీచర్లు గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ ప్రైవేట్ బడిలో చదివే విద్యార్థులు, బడి బయట ఉన్న వారు ప్రభుత్వ బడిలో చేరుతున్న దాఖలాలు లేవు. జిల్లాలో 876 ప్రభుత్వ నాన్ రెసిడెన్షియల్ పాఠశాలలుండగా, అందులో 61,533 విద్యార్థులున్నారు. కాగా కేవలం 103 ప్రైవేట్ పాఠశాలల్లో 39,872 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటికే 27 ప్రభుత్వ పాఠశాలలు జీరో నమోదుగా ముద్రపడ్డాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో 15 ఏళ్లలో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ముంచుకొస్తుంది.

ఫలితాలు ఘనం.. ప్రవేశాలు అధ్వానం

ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా 96.87 శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచింది. కానీ ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం పెరగడం లేదు. గత మూడేళ్లలో విద్యార్థుల నమోదు 74.99 శాతం నుంచి 67.53 శాతానికి తగ్గింది. ప్రైవేట్ పాఠశాలలు మాత్రం 25.01 నుంచి 32.47 శాతానికి పెరిగింది. గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీల్లో విద్యార్థుల నమోదు పర్వాలేదనిపిస్తుంది.

గణాంకాల మూట..

ఏటా విద్యాశాఖ ఆర్భాటంగా నిర్వహిస్తున్న బడి బాట గణాంకాల మూటగానే మారుతుందన్న విమర్శలున్నాయి. జూన్ మొదటి వారంలో ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట నిర్వహిస్తున్నారు. ర్యాలీలు నిర్వహించడం, కరపత్రాలు పంచడం, పదో తరగతి ఫలితాలు చూపడం, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు ప్రచార అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారు. పాఠశాల తెరవగానే అంగన్‌వాడీ నుంచి 1వ తరగతిలో, సీపీఎస్ నుంచి 6వ తరగతిలో చేరే విద్యార్థులను బడి బాటలో కొత్తగా చేరినట్లు లెక్కలు చూపుతున్నారు.



ఇంటింటి సర్వేకు కలెక్టర్ ఆదేశం

జూన్ 6 నుంచి జరిగే బడిబాటలో ఇంటింటి సర్వే జరపాలని ఇటీవల జరిగిన విద్యాశాఖ అధికారుల సమావేశంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. ఇంట్లో బడీడు కలిగిన విద్యార్థులు ఎంత మంది ఉన్నారు. ఎక్కడ చదువుతున్నారు, చదువుకోని వారు ఎంత మంది అన్న వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. దీన్ని నిర్ధారణ చేసుకోవడానికి థర్డ్ పార్టీ సర్వే కూడా చేయిస్తామని తెలిపారు. అర్హతను అనుసరించి ప్రతి ఒక్కరూ చదువుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ బడిలో చదువుతున్న విద్యార్థులు పైతరగతి కోసం మరో ప్రభుత్వ బడిలో చేరితే వారిని కొత్తగా నమోదు చేసినట్లు బడిబాట కార్యక్రమంలో చూపడం సరికాదన్నారు. చదువు మానేసిన వారిని, అసలు చదువుకోని వారిని గుర్తించి, వారి అర్హతలను బట్టి చదువుకునే అవకాశాలను కల్పించాలన్నారు. ఇతర పాఠశాలల నుంచి ప్రభుత్వ బడిలో చేర్పించే వారిని మాత్రమే బడి బాటలో చూపాలని ఆదేశించారు.

ప్రీ ప్రైమరీతో నమోదు పెరిగే అవకాశం

ప్రభుత్వ బడుల్లో ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ లేకపోవడంతో చాలా మంది పోషకులు వారి పిల్లలను ప్రైవేట్‌లో చేర్పించి, అక్కడే పైచదువులు కొనసాగిస్తున్నారు. అందుకే విడతల వారీగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటుంది. అంగన్‌వాడీలను ప్రభుత్వ పాఠశాలలకు అనుసంధానం చేయాలని నిర్ణయించింది. ఎల్‌కేజీ స్థాయి నుంచి ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

నమ్మకం పెంచుతాం



సర్కార్ బడుల్లో వినూత్న మార్పులు రాబోతున్నాయి. 30కిపైగా విద్యార్థులున్న బడిలో ఏఐ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తాం. కంప్యూటర్ బోధనకు ప్రాధాన్యమిస్తాం. తరచుగా పాఠశాలల మానిటరింగ్ చేస్తాం. ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డులతో అర్థమయ్యేలా బోధన కొనసాగిస్తాం. ఒత్తిడి లేని చదువులు అందిస్తాం. విద్యార్థులో క్రియేటివిటి పెంపొందిస్తాం. ఆటపాటల్లో ఆరితేరేలా తీర్చిదిద్దుతాం

- రాధాకిషన్, డీఈఓ, మెదక్

దేవుడా.. ఎన్నాళ్లీ వెతలు

ఇన్‌చార్జి ఈఓలతో ఆలయాల నిర్వహణ

- సమస్యలతో భక్తులు సతమతం
- 30 పోస్టులు ఖాళీ.. గ్రూప్‌– 2 పైనే ఆశలు



సంగారెడ్డి జోన్: రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన ప్రముఖ దేవాలయాలు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్నాయి. ఆయా దేవాలయాలకు రెగ్యులర్ ఈఓలు లేకపోవడంతో ఏళ్లుగా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఫలితంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. అదేవిధంగా ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న ఆలయ అధికారులకు సైతం పలు రకా ల ఇబ్బందులు తప్పడం లేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 36 ప్రముఖ దేవాలయాలున్నాయి. అదేవిధంగా ధూప దీప నైవేద్యం పథకం ద్వారా గుర్తింపు పొందినవి 939 దేవాలయాలు న్నాయి. ఆలయాలకు వచ్చే ఆదాయాన్ని బట్టి నాలుగు కేటగిరీల వారీగా విభజించారు. 6(ఏ) కేటగిరీలో 13, 6(బీ) కేటగిరీలో 12, 6(సీ) కేటగిరీలో 10, 6 (డీ) కేటగిరీలో 1 చొప్పున ఆలయాలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో ఝరాసంగం కేతకీ సంగమేశ్వర ఆలయం, రుద్రారం గణేశ్‌గడ్డ, బొంతపల్లి శ్రీ భద్రకాళి సహిత వీరభద్రేశ్వర, మెదక్‌లోని ఏడుపాయల శ్రీ దుర్గ భవాని ఆలయం, సిద్దిపేటలోని కోటిలింగాల, వెంకటేశ్వర తదితర ఆలయాలున్నాయి.

ఒక్కో అధికారికి పదికి పైగా బాధ్యతలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో 36 ఈఓ పోస్టులు మంజూరు ఉండగా కేవలం 6 పోస్టులు మాత్రమే భర్తీ ఉన్నాయి. ఒక్కో ఈఓకు సుమారు 10కి పైగా ఆలయాలకు అధికారులుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆలయ అధికారులకు అదనపు బాధ్యతలు ఉండటంతో ఆలయ అభివృద్ధి జరగకపోవటంతోపాటు భక్తుల సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఆలయాల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాల్సి ఉన్న తమ పరిధిలో ఉన్న ఆలయాల సందర్శనకు మాత్రమే సమయం సరిపోతుందని అధికారులు చెబుతున్నా రు. అదనపు బాధ్యతలతో ఆలయ అధికారులకు బాధ్యతలు, నిర్వహణ భారంగా మారాయి. అధికారులకు కేటాయించిన ఆలయాలు కొన్ని కిలోమీటర్ల మేర దూరం ఉండటంతో అధికారులకు దూరాభారంతోపాటు సమయం వృథా అవుతోంది. ఆలయాలకు కోర్టు తగాదా లు ఉండటంతో అక్కడికి హాజరు అవుతుండటంతో ఆలయ అధికారులకు ఆలయ నిర్వహణ భారంగా మారింది.

నియామకం కానీ రెగ్యులర్ అధికారులు

ఆలయ అధికారులే కాకుండా దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వారికి సైతం ఆలయాల నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఏడుపాయల దుర్గా భవాని ఆలయ ఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సుమారు పదేళ్ల నుంచి దేవదాయ శాఖలో ఈఓ పోస్టులు భర్తీ చేసినప్పటికీ పూర్తిస్థాయిలో చేపట్టలేకపోయారు. ఇటీవల గ్రూప్‌–2 ఫలితాలు విడుదల కావడంతో వాటి ద్వారా నియామకం చేపట్టే అవకాశాలున్నాయని సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు.

ఏడుపాయలలో భక్తుల సందడి

పాపన్నపేట(మెదక్): ప్రసిద్ధి చెందిన ఏడుపాయల క్షేత్రం ఆదివారం జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మంజీరా పాయల్లో స్నానాలు చేసి దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం పోసి, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇబ్బంది కలగకుండా ఆలయ సిబ్బంది, పోలీసులు ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక అలంకరణలో వన దుర్గమ్మ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చిరుతల అలజడి



- అడవిలో తాగు నీరు లేక గ్రామాల్లోకి..
- నెల రోజుల వ్యవధిలో ఐదు పశువులు హతం
- ఆందోళనలో కాట్రియాల తండా వాసులు



దుప్పి కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రామాయంపేట(మెదక్): అటవీ ప్రాంతంలో తాగునీటి సదుపాయం కల్పించకపోవడంతో చిరుతలు గ్రామాల బాట పడుతున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే ఐదు పశువులు, ఒక దుప్పిని హతమార్చాయి. తమపైన దాడికి దిగుతాయని అటవీ ప్రాంతానికి సమీప గ్రామాల ప్రజలు, గిరిజనులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. తాజాగా శనివారం రాత్రి మూడు చిరుతలు కాట్రియాల తండా వద్ద కుంటలో నీరు తాగడానికి వచ్చి దుప్పిని చంపాయి. అటవీశాఖ అధికారులు ఈ వేసవిలో అడవిలో వణ్యప్రాణులకు తాగు నీటి సదుపాయం కల్పించలేదు. దీంతో అవి నీటి కోసం అల్లాడుతూ గ్రామాలు, తండాలకు వచ్చి అలజడి సృష్టిస్తున్నాయి. కాట్రియాల తండా అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉంది. తండావాసులు తమ పశువులను శివారులోని బహిరంగ ప్రదేశంలో ఉంచుతారు. గత రెండు నెలలుగా తరచూ చిరుతలు పశువులపై దాడి చేస్తున్నాయి. నెల క్రితం ఒకే రాత్రి పశువుల కొట్టంలో ఉన్న పశువులపై దాడికి పాల్పడి ఏకంగా ఐదు లేగ దూడలను చిరుతలు హతమార్చాయి. దీంతో తండా వాసులు అటవీ ప్రాంతానికి వెళ్లడానికి జంకుతున్నారు. తండాను ఆనుకొని ఉన్న జైత్య కుంటలోకి తాగు నీటి కోసం చిరుతలతో పాటు ఇతర వణ్యప్రాణులు రోజూ వస్తున్నాయి. వీటిని ప్రత్యక్షంగా చూస్తున్న వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాజాగా రాత్రి చిరుతతో పాటు రెండు పిల్లలు కుంట వద్దకు వచ్చాయి. అదే సమయంలో తాగు నీటి కోసం వచ్చిన దుప్పిని హతమార్చాయి. భయాందోళన చెందిన తండా గిరిజనులు ఈవిషయమై అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సంఘటనా స్థలిని పరిశీలించిన అధికారులు అక్కడే పంచనామా నిర్వహించి దుప్పి కళేబరాన్ని అటవీప్రాంతంలో దహనం చేశారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



ఈ వేసవిలో తాగు నీటి కోసం చిరుతలతో పాటు ఇతర జంతువులు గ్రామాలు, తండాల వద్దకు వస్తున్నాయి. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. రాత్రివేళ ఆరు బయటకు ఒక్కరే వెళ్లవద్దు. గుంపులుగా, కర్రలు చేతపట్టుకొని వెళ్లాలి. చిరుతలు కనిపిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలి.

- ఖుద్బుద్దీన్, మెదక్ డిప్యూటీ రేంజ్ అధికారి

ఉద్యాన పంటలకు ఊతం

- ప్రస్తుతం జిల్లాలో 9 వేల ఎకరాల్లో సాగు
- వానాకాలం 2,850 ఎకరాలు లక్ష్యం
- భారీ సబ్సిడీలతో రైతులకు ప్రోత్సాహం

మెదక్ కలెక్టరేట్: రైతులు కేవలం వరికే పరిమితం కావడంతో ఆర్థికంగా ఆశించిన అభివృద్ధి సాధించలేకపోతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం ప్రతి రైతు వాణిజ్య పంటలు సాగు చేసి ఆర్థికాభివృద్ధి సాధించడమే కాకుండా, జాతీయ స్థాయిలో ఎదిగేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రస్తుతం జిల్లాలో 9 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం, పండ్ల తోటలు, కూరగాయలు, పూల తోటలు సాగవుతున్నాయి. ఈ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు పెద్ద ఎత్తున సబ్సిడీలు అందజేస్తుంది. అయితే 2025– 26 వానాకాలం సీజన్‌లో జిల్లాలో 2,850 ఎకరాల్లో పంటల సాగు జరగాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఉద్యానవన శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకోసం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులకు తెలియజేస్తూ పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయిల్‌పాం, బిందు, తుంపర సేద్యానికి లక్ష్యాలను కేటాయించింది.

జాతీయ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్

ఈ పథకం ద్వారా జిల్లాలో ఆయిల్‌పాం సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు జిల్లాకు 2025– 26 సంవత్సరానికి గాను 2,500 ఎకరాల లక్ష్యం కేటాయించారు. ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసే రైతులకు గతంలో మాదిరిగానే ఎకరానికి ఏడాదికి రూ. 4,200 చొప్పున మొత్తం 4 సంవత్సరాలకు 16,800 మొక్కలపై 11,001 రాయితీ కల్పిస్తున్నారు.

మైక్రో ఇరిగేషన్

ఈ పథకం ద్వారా బిందు, తుంపర సేద్యం ద్వారా వాణిజ్య పంటల సాగుకు లక్ష్యాన్ని కేటాయించారు. ఇందులో ఆయిల్‌పాం సాగుకు 2,500 ఎకరాలు, కూరగాయలు, మిరప, మొక్కజొన్న తదితర పంటలకు 1,470 ఎకరాలు, పండ్ల తోటలకు గాను 368 ఎకరాలు, తుంపర సేద్యానికి గాను 80 ఎకరాల లక్ష్యం కేటాయించారు.

వంద శాతం సబ్సిడీ

జిల్లాలో ఆయిల్‌పాం తోటలు సాగు చేసే ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం బీసీ, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం చొప్పున ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తూ ప్రోత్సహిస్తుంది. అలాగే పండ్ల తోటలు, ప్లాస్టిక్ మల్చింగ్, పూల తోటల సాగు, హైబ్రిడ్ కూరగాయల నారు పండించే రైతులను ప్రోత్సహించేందుకు పెద్ద ఎత్తున సబ్సిడీలు అందజేస్తుంది.

రాష్ట్రీయ ఉద్యాన మిషన్

ఈ పథకం ద్వారా వివిధ పండ్ల తోటలు సాగు చేసేందుకు, హైబ్రిడ్ కూరగాయల నారు సరఫరా, పూల తోటల సాగు, ప్లాస్టిక్ మల్చింగ్ వేసుకునే రైతులకు రాయితీ సదుపాయం కల్పిస్తున్నారు. పండ్లతోటల సాగుకు సంబంధించి బొప్పాయి, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో సాగు చేయదలచిన రైతులకు రాయితీ సదుపాయం లభిస్తుంది. కూరగాయలు సాగు చేసే రైతులకు సిద్దిపేట జిల్లా ములుగులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నర్సరీ నుంచి సబ్సిడీపై హైబ్రిడ్ కూరగాయల నారు సరఫరా చేస్తున్నారు.



డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగుచేస్తున్న పంటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి

రైతులు లాభాలు వచ్చే ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలి. ఆయిల్‌పాం, మామిడి, జామ, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, అవకాడో వంటి వాణిజ్య పంటలు సాగు చేయాలి. ప్రభుత్వం పెద్దఎత్తున సబ్సిడీలు అందిస్తుంది. వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి.

- ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

క్లుప్తంగా

జాతరలో సునీతారెడ్డి పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్‌లో జరుగుతున్న శ్రీమల్లికార్జునస్వామి (మల్లన్న) జాతరలో ఆదివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాత, నిర్వాహకులు శామీర్‌పేట నర్సింగారావు దంపతుల ఆధ్వర్యంలో దేవతామూర్తులకు ఒగ్గు పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నాగ్సాన్‌పల్లి మాజీ సర్పంచ్ ఎల్లం, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సార రామాగౌడ్, మాజీ ఎంపీటీసీ స్వప్న కిషోర్ గౌడ్, మొగులాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టొద్దు

బైరి నరేశ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

గజ్వేల్‌రూరల్: నాసికత్వం పేరుతో ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టొద్దని మండల పరిధిలోని బెజుగామ గ్రామస్తులు, గ్రామ యువత పేర్కొన్నారు. ఆదివారం గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం(ఎంఎస్ఎస్) వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు బైరి నరేశ్‌ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ యువత మాట్లాడుతూ.. దేవుళ్లను నమ్మవద్దంటూ ప్రజల్లో విద్వేశాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తూ తమల్ని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు తలెత్తకముందే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. బైరి నరేశ్ మాట్లాడుతూ.. తాను పూర్తిగా మారిపోయానని, ఎవరినీ ఇబ్బందులకు గురి చేసేందుకు రాలేదని పేర్కొంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కుళ్లినస్థితిలో మృతదేహం గుర్తింపు

చిన్నశంకరంపేట(మెదక్): కుళ్లిస్థితిలో మృతదేహం లభ్యమైన ఘటన నార్సింగి మండలం నర్సంపల్లి అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నర్సంపల్లి గ్రామానికి చెందిన జెగ్గరి సత్యం మరికొందరు రైతులు కలిసి ఆదివారం అడవిలో తునికి ఆకును తెంపుతున్న క్రమంలో గుట్టరాళ్ల మధ్య మృతదేహాన్ని గమనించారు. వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో బండరాళ్ల మధ్య మృతదేహం ఉండటంతో ఇన్ని రోజులు ఎవరూ గమనించలేదని తెలిపారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో వివరాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మోహినోద్దీన్ తెలిపారు.

రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్‌కు సిద్దిపేట వేదిక

ఏపీఐ వైస్ చైర్మన్ డాక్టర్ గణేశ్ వెనిశెట్టి

సిద్దిపేటకమాన్: జనరల్ ఫిజీషియన్ వైద్యుల రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్‌కు సిద్దిపేట వేదిక కావడం తమకు గర్వకారణమని అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్ ఆఫ్ ఇండియా (ఏపీఐ) వైస్ చైర్మన్ డాక్టర్ గణేశ్ వెనిశెట్టి అన్నారు. సిద్దిపేట ఐఎంఏ హాల్‌లో జనరల్ ఫిజీషియన్ వైద్యుల రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలోని 200 మంది ప్రముఖ జనరల్ ఫిజీషియన్లు పాల్గొన్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పేషెంట్ ఆస్పత్రికి వచ్చినప్పుడు ఎలాంటి చికిత్స అందించాలి. సబ్జెక్ట్ అప్‌డేట్ చేసుకోవడం, చికిత్సలో నూతన టెక్నాలజీ వినియోగం అంశాలపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ పెంటాచారి, జనరల్ సెక్రటరీ డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ గణేశ్, డాక్టర్ ఫణిందర్ తదితరులు పాల్గొన్నారు.

సేద్యంలో లక్ష్మి

సాగులో కొత్త ఒరవడి చూపిస్తున్న కంచన్‌పల్లి మహిళా రైతు

గ్రామాల్లో చేసేదే వ్యవసాయం. అందులో మహిళల పాత్ర అమోఘం. అందరిలా కాకుండా కొంచం కొత్తగా ఆలోచించి సాగులో పంటమార్పు, వరిలో మినికిట్స్ సాగుకు తోడు కూరగాయలు సాగు చేసింది. కొత్తదనానికి ఆధునికత జోడించి సాగు చేయగా రాష్ట్ర ఉత్తమ మహిళా అభ్యుదయ రైతుతో పాటు పీజేటీఏయూ ఆర్‌ఈఏసీ మహిళా సభ్యురాలిగా ఎంపికైంది కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి గ్రామ మహిళా రైతు నాయిని లక్ష్మి. ఆమె సాగు ప్రస్థానం, ఎంపికపై ప్రత్యేక కథనం...

– కౌడిపల్లి(నర్సాపూర్)

- వరి మినికిట్స్, కూరగాయలు సేంద్రియ సాగుతో గుర్తింపు
- పంటమార్పు కోసం బంతి, కంది
- పీజేటీఏయూ ఆర్‌ఈఏసీ సభ్యురాలిగా ఎంపిక
- అంతకు ముందు రాష్ట్ర ఉత్తమ మహిళా అభ్యుదయ రైతుగా..
- సంగారెడ్డి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల ప్రోత్సాహం, కేవీకే సలహాలు, సూచనలతో ముందుకు


కాకరకాయ పంటలో భర్తతో కలిసి పనులు చేస్తున్న లక్ష్మి

కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి గ్రామానికి చెందిన నాయిని లక్ష్మి, భర్త రామక్రిష్టాగౌడ్, ఇద్దరు పిల్లలతోపాటు ఉమ్మడి కుటుంబం ఉంది. మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయ కుటుంబం కావడంతో భార్యాభర్తలు సాగు చేస్తున్నారు. కాగా లక్ష్మి భిన్నంగా ఆలోచించి సాంప్రదాయ సాగుకు ఆధునికత, కొత్తదనం జోడించింది. వరి పంటతోపాటు పంటమార్పు చేస్తూ కూరగాయలు, బంతిపూలు, కంది పంట సాగు చేసింది.

మినికిట్స్ సాగు

సంగారెడ్డి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, సంధ్య సూచనలతో వరి పంటలో 5 కిలోల ఫౌండేషన్ విత్తన మినికిట్స్ సాగు చేశారు. ఇందులో ఆర్‌ఎన్‌ఆర్ 21278, 31479, 15048 (షుగర్‌లెస్), కేఎన్ఎం 12368, డబ్ల్యూజీఎల్ 28369, ఆర్‌డీఆర్ 1260, కేఉపీఎస్ 625 రకం వరి పంటను సాగు చేసి వచ్చిన ధాన్యాన్ని తోటి రైతులకు విత్తనాలుగా అమ్మారు. దీనికితోడు వరిలో దేశివాలి రకం కుచ్ పటారియా, చిరూర్‌కి, చిట్టిముత్యాలు, కాలబత్తి(నల్లవడ్లు) సాగు చేశారు.

అభ్యుదయ రైతుగా గుర్తింపు


అభ్యుదయ రైతుగా ఎంపికైన లక్ష్మిని సన్మానిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మినికిట్స్ సాగుతోపాటు పంట మార్పు చేసి సాగు చేయడంతో సంగారెడ్డి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డిసెంబర్ 2024లో పీజేటీఏయూ వజ్రోత్సవాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు అభ్యుదయ రైతులను ఎంపిక చేశారు. అందులో కంచన్‌పల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు లక్ష్మి ఎంపికైంది. దీంతో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ సహాయ సంచాలకు ఉమారెడ్డి ప్రశంసాపత్రం, మెమొంటో అందజేసి సన్మానించారు.

పంటమార్పు కోసం :

వరి పంటలో మార్పుకోసం కూరగాయలు టమాటా, వంకాయ, కాకరతోపాటు బంతిపూలు, కంది సాగు చేశారు. దీంతోపాటు పది గుంటల్లో తొమ్మిది రకాల కూరగాయల పంట ఇంటి అవసరాల కోసం సాగు చేశారు. కూరగాయలు, వరి పంటలో ఒక ఎకరం సేంద్రియ పద్ధతిలో సాగు చేసినట్లు తెలిపారు. మండలంలోని తునికి వద్ద గల కేవీకే శాస్త్రవేత్తలు ఆవును ఇవ్వగా వారి సూచనలతో ఆవును పెంచుతూ దాని పేడ, మూత్రంతో జీవాంమృతం, బీజాంమృతం ఎరువు తయారీ చీడపీడల నివారణకు వివిధ రకాల ఆకుల కషాయాలు తయారు చేసి వినియోగించింది.

ఆర్‌ఈఏసీ సభ్యురాలిగా లక్ష్మి ఎంపిక

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఏయూ) ఆర్‌ఈఏసీ (రీసెర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్ అడ్వైజరీ కౌన్సిల్) సభ్యులుగా రాష్ట్ర వ్యాప్తంగా నలుగురు రైతులను ఎంపిక చేయగా అందులో మహిళా రైతుగా నాయిని లక్ష్మిని ఎంపిక చేశారు. వైస్ చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య లక్ష్మిని అభినందించారు. రెండేళ్లపాటు సభ్యురాలిగా కొనసాగనుండగా సాగుపై సలహాలు సూచనలు ఇవ్వనున్నారు. ఇప్పటికే ఆర్‌ఈఏసీ సమావేశంలో రైతులకు అందుబాటులో ఉండేలా నర్సాపూర్‌లో విత్తన గోదాం, టింబర్ గోదాం నిర్మించాలని సూచించినట్లు తెలిపారు.

కుటుంబ సభ్యుల సహకారంతో..



భర్త రామక్రిష్టాగౌడ్ తోపాటు కుంటుంబ సభ్యులు సహకారంతో సాగు చేస్తున్నా. సాగులో మినికిట్స్, పంట మార్పిడి, కూరగాయలు సాగు చేశా. ప్రస్తుతం వరి పంట కోత పూర్తికాగా కాకరకాయ, టమాటా, వంకాయ పంట ఉంది. దీంతోపాటు ఇంటి పంటగా పలు రకాల ఆకు కూరలు ఉన్నాయి. సాగులో గుర్తింపు వచ్చి ఆర్‌ఈఏసీ సభ్యురాలిగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– నాయిని లక్ష్మి, ఆర్‌ఈఏసీ సభ్యురాలు



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

హక్కుల కోసం పోరాడేది 'సీపీఐ'

- అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): కార్మికుల, కూలీల హక్కుల సాధన కోసం పోరాడేది సీపీఐ పార్టీయేనని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. బెజ్జంకిలో సీపీఐ మండల 13వ మహాసభలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇటీవల మృతి చెందిన సీపీఐ నాయకులకు, పహల్గామ్ మృతులకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉపాధి హామీలాంటి అనేక చట్టాలను అప్పటి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అమలు చేయించామన్నారు. కేంద్రం కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహిస్తూ పేదలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు, తదితర సంక్షేమ పథకాలు నిరుపేదలకు ఇవ్వాలని సూచించారు. దేశమంతా ముక్త కంఠంతో పార్టీలకతీతంగా ఆపరేషన్ సిందూర్‌కు అండగా ఉంటుందన్నారు. నిత్యావసర ధరల పెరుగుదల, కార్మికుల హక్కులపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా 20న ఏఐటీయూసీ నిర్వహించే సమ్మెకు సంపూర్ణ మద్దతిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మంద పవన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, శంకర్, మండల కార్యదర్శి రూపేశ్, మధు, మహేశ్ పాల్గొన్నారు.

ఆడుకుంటూ ఇనుప చువ్వలకు తగిలి

విద్యుదాఘాతంతో తొమ్మిదేళ్ల బాలుడు మృతి


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

హవేళిఘణాపూర్(మెదక్): విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని లింగ్సాన్‌పల్లి తండాలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన చిలికి, మోహన్ పెద్ద కుమారుడు రీతు(10) నాల్గో తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఆడుతూ స్లాబ్ పైకి ఎక్కి ఇనుప చువ్వలకు తగిలాడు. అప్పటికే వైరు తేలి ఉండటంతో కరెంటు షాక్ కొట్టి పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లే లోపే మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్‌ఐ సత్యనారాయణను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వాటర్ హీటర్ షాక్‌తో..

పాపన్నపేట(మెదక్): వాటర్ హీటర్ షాక్ కొట్టి మహిళ మృతి చెందిన ఘటన పాపన్నపేటలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బెస్త భాగ్య, భూపతి దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. ఉదయం చేపలు పట్టడానికి భూపతి వెళ్లగా, పిల్లలు అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. ఇంటిలో ఒంటరిగా ఉన్న భాగ్య (36) స్నానం చేయడానికి బకెట్ నీటిలో వాటర్ హీటర్ పెట్టింది. కరెంట్ ఆఫ్ చేయకుండా నీరు వేడి అయ్యాయా లేదా అని బకెట్‌లో చేయి పెట్టి చూడగా షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.


భాగ్య (ఫైల్)

వడదెబ్బతో అడ్డా కూలీ

తూప్రాన్ : వడదెబ్బతో అడ్డా కూలీ మృతి చెందిన ఘటన పట్టణ కేంద్రంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. మాసాయిపేట మండలం పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన దుర్గం బాలయ్య(44) అడ్డా కూలీగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా తూప్రాన్‌లో అడ్డా మీదికి శనివారం ఉదయం ఇంటి నుంచి వచ్చాడు. రాత్రి మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా రోడ్డు పక్కన పడి ఉన్నాడు. పెట్రోలింగ్ కోసం వచ్చిన పోలీసులు గుర్తించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న భార్య లక్ష్మి, కుమారులు ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని గుర్తించారు. వడదెబ్బ కారణంగా మృతి చెందాడని వైద్యులు తెలుపడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.


బాలయ్య (ఫైల్)

రెండు బైక్‌లు ఢీ: ఒకరు మృతి


శేఖర్ మృతదేహం

పాపన్నపేట(మెదక్): రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన పాపన్నపేట మండలం కుర్తివాడ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. కుర్తివాడ గ్రామానికి చెందిన కర్రెల శేఖర్(60) నిత్యం హనుమన్ ఆలయం వద్ద పరిసరాలు శుభ్రం చేస్తుంటాడు. ఆదివారం టీవీఎస్ మోపెడ్‌పై కుర్తివాడ నుంచి పాపన్నపేట వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మిన్‌పూర్ గ్రామం నుంచి మెదక్ వైపు వెళ్తున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్‌కు, మరో బైక్‌పై ఉన్న కిష్టయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శేఖర్ మృతి చెందాడు. కిష్టయ్యను మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌పై నుంచి పడి యువకుడు

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కర్నాల్‌పల్లి శివారులో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మృతుడి బంధువుల కథనం మేరకు.. రామాయంపేట మండలం దంతపల్లి గ్రామానికి చెందిన కేసరి ప్రవీణ్ (25) గ్రామంలో వాటర్ మెన్‌గా పని చేస్తున్నాడు. బంధువులకు సంబంధించిన ఓ వేడుక కోసం కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయం వద్దకు వచ్చాడు. బైక్‌పై చేగుంట వైపునకు వెళ్తున్న ప్రవీణ్ వాహనం అదుపుతప్పి కిందపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.



ప్రవీణ్(ఫైల్)

భారీ వాహనం బోల్తా


మామిడిపల్లి చౌరస్తా వద్ద బోల్తా పడిన వాహనం

కంది(సంగారెడ్డి): కంది మండలం మామిడిపల్లి చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై భారీ వాహనం బోల్తా పడింది. శనివారం రాత్రి నాందేడ్ అకోలా వైపు నుంచి ముంబై వైపు వెళ్తున్న భారీ వాహనం మామిడిపల్లి చౌరస్తా వద్ద బ్రిడ్జి దిగుతున్న క్రమంలో మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బోల్తా పడిన సమయంలో వెనక నుంచి ఇతర వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. కాగా ఈ విషయమై రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందలేదని ఎస్సై రవీందర్ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి


మృత్యువాత పడిన గొర్రెలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం బద్రా్య తండాలో జరిగింది. గొర్రెల యజమాని కడావత్ లక్ష్మణ్ కథనం మేరకు.. శనివారం జీవాలను మేపుకొచ్చి పాకలోకి పంపించాం. ఆదివారం ఉదయం పాక దగ్గరకి వెళ్లి చూడగా నాలుగు గొర్రెలు మృతి చెంది కనిపించాయి. గొర్రెలపై కుక్కలు దాడి చేసినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. గొర్రెల మృతితో నష్టం జరిగిందని లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశాడు.


రోదిస్తున్న బాధిత రైతు

పిడుగుపాటుతో పాడి గేదె

మద్దూరు(హుస్నాబాద్): పిడుగుపాటుతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మానేపల్లి రామచంద్ర తన వ్యవసాయ బావి వద్ద శనివారం రాత్రి గేదెను కట్టేసి ఇంటికొచ్చాడు. ఉదయం వెళ్లి చూసేసరికి పిడుగుపాటుతో గేదె మృతి చెందింది. రూ.65 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

ఈఏపీసెట్‌లో మెరుగైన ర్యాంక్


భాను ప్రసాద్

దుబ్బాక : ఈఏపీసెట్ ఫలితాల్లో దుబ్బాక పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థి మర్రికింది భాను ప్రసాద్ 2,101 ర్యాంక్ సాధించాడు. రామాయంపేటకు చెందిన భానుప్రసాద్ దుబ్బాక మైనార్టీ రెసిడెన్షియల్‌లో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివాడు. ఇంటర్‌లో 940 మార్కులు సాధించాడు. రాష్ట్ర స్థాయిలో 2,101 ర్యాంక్ సాధించడం పట్ల పాఠశాల అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేశారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

తూప్రాన్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండలంలోని పాలాట గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో అల్ఫగిరి సీడ్స్‌కు చెందిన వరి వంగడాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేలైన విత్తనాలతో ఎకరానికి సుమారు 40 బస్తాల వరకు దిగుబడి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య, మల్లేశం, వెంకటేశ్, నర్సింహా రెడ్డి, ఆరోగ్యరెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుల అరెస్ట్


నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ పరమేశ్వర్ గౌడ్ కథనం మేరకు.. పటాన్‌చెరు శివారు ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్‌లో ఆదివారం రూట్ వాచ్ నిర్వహిస్తుండగా రెండు బైకుల్లో 1600 గ్రాముల గంజాయిని తీసుకెళ్తున్న ఆరుగురిని పట్టుకున్నారు. పట్టుబడిన వారు సంగారెడ్డికి చెందిన తునికి ఫణీంద్ర, వికారాబాద్‌కు చెందిన వికాస్, పటాన్‌చెరు మండలం క్యాసారం చెందిన సిరిపురం సంపత్, హైదరాబాద్ లాలాపేట్‌కు చెందిన ధనరాజ్, బొల్లారానికి చెందిన ఆంజనేయులు మహబూబ్‌నగర్‌కి చెందిన చాకలి బాలరాజుగా గుర్తించారు. పట్టుబడిన గంజాయి, ఐదు సెల్ ఫోన్‌లు, రెండు బైక్‌లను సీజ్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మాణానికి రూ.కోట్లు.. తీరని పాట్లు

- నిరుపయోగంగా హుస్నాబాద్ రైతు బజార్
- స్థలం ఒకరిది.. నిర్మాణం మరొకరిది
- అధికారుల మధ్య లోపంతో తెరుచుకోని భవనం
- రోడ్ల వెంటే కూరగాయల అమ్మకాలు
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు


రోడ్ల పైనే కూరగాయల అమ్మకాలు


రైతు బజార్ భవనం

హుస్నాబాద్: స్థానిక చిరు వ్యాపారస్తుల కోసం ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించి హుస్నాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన రైతు బజార్ నిరుపయోగంగా మారింది. దీంతో రైతులు పండించిన తాము పండించిన కూరగాయాలను పట్టణంలోని మల్లె చెట్టు చౌరస్తా, బస్టాండ్ ఏరియా, అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్లపైన ఎండకు ఎండుతూ, వానకు నానుతూ అమ్ముకుంటున్న పరిస్థితి నెలకొంది.

రూ.3 కోట్లతో నిర్మాణం

రైతులు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు వీలుగా ప్రభుత్వం పట్టణంలోని శివాజీనగర్‌లో రూ.3 కోట్ల వ్యయంతో రైతు బజార్‌ను నిర్మించింది. జనవరి 5, 2025న మంత్రి పొన్నం ప్రభాకర్ భవనాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. కానీ అధికారుల మధ్య సమన్వయం లేక ప్రస్తుతం అది నిరుపయోగంగా మారింది. మున్సిపాలిటీకి చెందిన స్థలంలో వ్యవసాయ మార్కెట్ యార్డు తమ నిధులతో రైతు బజార్ భవనాన్ని నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రైతు బజార్ కోసం 6 షెటర్లు నిర్మించారు. పై రెండు అంతస్తుల్లో సువిశాలంగా ఫంక్షన్ హాల్ నిర్మించారు. రైతు బజార్, ఫంక్షన్ హాల్ ద్వారా వచ్చే ఆదాయమంతా వ్యవసాయ మార్కెట్‌కే చెందుతుంది. రోడ్లపై కూరగాయలు అమ్ముతున్న రైతులు, చిరు వ్యాపారులను రైతు బజార్‌కు రప్పించే అధికారం మున్సిపల్ అధికారులకు ఉంటుంది. కానీ తమకు ఆదాయం లేదని రైతు బజార్‌కు తమకు ఎలాంటి సంబంధం లేనట్లుగా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారు.

కొన్నేళ్ల నుంచి రోడ్లపైనే విక్రయాలు

వివిధ మండలాల రైతులు తాము పండించిన కూరగాయలు అమ్ముకునేందుకు నిత్యం హుస్నాబాద్‌కు వస్తుంటారు. పట్టణంలో ఇంత వరకు కూరగాయల మార్కెట్ గానీ, రైతు బజార్ గానీ లేదు. దీంతో కొన్నేళ్ల నుంచి రైతులు పండించిన పంటలను రోడ్ల పైనే అమ్ముకుని కొనసాగిస్తున్నారు. రైతు బజార్ వినియోగంలోకి వస్తే తాజా కూరగాయలు, ఇతరాత్ర పంట ఉత్పత్తులు ప్రజలకు తక్కువ ధరలకే లభించనున్నాయి. అలాగే, రోడ్ల పైనే కూరగాయలు అమ్ముడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. గతంలో పోలీసులు రోడ్లపై కూరగాయలు అమ్మొద్దని తరాజులను తీసుకెళ్లిన పరిస్థితి ఉంది. రైతు బజార్‌ను నిర్మించిన వ్యవసాయ మార్కెట్ అధికారులు, పాలకవర్గం పట్టించుకోకపోవడం వల్లనే రైతు బజార్ అలంకారప్రాయంగా మారిందని విమర్శలు వెలువెత్తుతున్నాయి.

పది రోజుల్లో అందుబాటులోకి తెస్తాం

రైతు బజార్‌లో టాయిలెట్లు, లైటింగ్ సిస్టమ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎప్పటికప్పుడూ పనులను పర్యవేక్షిస్తున్నాం. పది రోజుల్లో పనులు పూర్తి చేసి రైతుల ముంగిటకు రైతు బజార్‌ను తెస్తాం. అన్ని సౌకర్యాలతో రైతు బజార్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– కంది తిరుపతి రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, హుస్నాబాద్